# అసోసియేషన్ పన్ను


- ఇసుక లారీల యజమానుల మధ్య లోకల్.. నాన్ లోకల్ లొల్లి
- ఒక్కో లారీకి రూ.500 చొప్పున వసూలు
- ప్రభుత్వ స్థలంలో అక్రమ పార్కింగ్ దందా

05

## పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

- సీఎస్ రామకృష్ణారావు
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

03



సంపుటి :02 | సంచిక :315 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

మంగళవారం 24, ఫిబ్రవరి 2026

## పేరుకే మండల కేంద్రం..

- పారిశుధ్యంలో అధ్వాన్నం!
- రోడ్లపైనే పారుతున్న మురుగునీరు..
- నరకప్రాయంగా ప్రయాణం



04



# రేవంత్ ధ్యాస 'ఫ్యూచర్ సిటీ'పైనే..

03

- పేదల 'హెల్త్ సిటీ'పై లేదు!
- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కావాలనే తొక్కిపెడుతున్నారు
- మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్
- పనులు పూర్తి చేయకపోతే వరంగల్ గడ్డపైనే నిరాహారదీక్ష చేస్తామని ప్రకటన
- ఎంజీఎం ఆసుపత్రి ఎలుకలు, పందికొక్కులకు అడ్డాగా మారిందని మండిపాటు
- బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'ఫ్యూచర్ సిటీ'పై ఉన్న ధ్యాస, పేదల కోసం నిర్మిస్తున్న 'హెల్త్ సిటీ'పై లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు ధ్వజమెత్తారు. మంగళవారం వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో శరవేగంగా సాగిన ఆసుపత్రి పనులు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అటకెక్కాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కమిషన్ల కోసమే డిజైన్ల మార్పు పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. 2000 పడకల ఆసుపత్రికి అవసరమైన డాక్టర్లు, సిబ్బంది నియామకంపై స్పష్టత లేకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. వెంటనే పనులు పూర్తి చేయకుంటే వరంగల్ గడ్డపైనే నిరాహారదీక్షకు దిగుతామని హరీష్ రావు హెచ్చరించారు.

– అక్షర దర్బార్, వరంగల్



## మావోయిస్ట్ పార్టీ

# సుప్రీం దేవ్‌జీ లొంగుబాటు

- అదే బాటలో అగ్రనేతలు రాజిరెడ్డి, నరసింహారెడ్డి, దామోదర్
- అజ్ఞాతంలో తెలంగాణకు చెందిన మరో 11 మంది మావోయిస్టులు
- వారు మాతో టచ్‌లో ఉన్నారు.. త్వరలోనే లొంగిపోతారు..
- అడవి బాట వీడిన ప్రతిఒక్కరికీ పునరావాస పథకాలు.. రివార్డులు
- డీజీపీ శివధర్‌రెడ్డి

ఐదు దశాబ్దాలుగా అడవిని నమ్ముకుని సాయుధ పోరాటం సాగించిన మావోయిస్టు అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలిశారు. మావోయిస్టు పార్టీ సుప్రీం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీతో పాటు సెంట్రల్ కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు, అగ్రనేత నూనే నరసింహారెడ్డి మంగళవారం డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. అనారోగ్యం, పార్టీ అంతర్గత విభేదాల వల్లే వీరు అడవి బాట వీడినట్లు తెలుస్తోంది. కోట్లాది రూపాయల రివార్డులు కలిగిన ఈ అగ్రనేతల లొంగుబాటుతో మావోయిస్టు పార్టీకి తెలంగాణలో కోలుకోలేని దెబ్బ తగిలిందని డీజీపీ పేర్కొన్నారు. మరో 11 మంది అజ్ఞాత నేతలు కూడా తమతో టచ్‌లో ఉన్నారని, త్వరలోనే వారు కూడా శాంతియుత మార్గాన్ని ఎంచుకుంటారని ఆయన వెల్లడించారు. – అక్షర దర్బార్, హైదరాబాద్


02



05

## ఏడుస్తున్నాడని కన్నబిడ్డ సజీవ దహనం

- కన్నతల్లి కర్కశత్వం.. దుండిగల్‌లో ఘటన
- నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



## సైబర్ నెట్‌వర్క్‌పై 'ఆక్టోపస్' పంజా!

02

- రూ. 127 కోట్ల మోసం..
- 16 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు




## ఆర్ఎస్ యూ నుంచి పార్టీ చీఫ్ గా తిరుపతి ప్రస్థానం

జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన తిప్పిరి తిరుపతి సుమారు 44 ఏళ్ల పాటు అజ్ఞాతంలో ఉన్నారు. ఈయన తండ్రి వెంకట నర్సయ్య ఒక సాధారణ రైతు. తిరుపతి విద్యార్థి దశలోనే విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు. 1978లో జరిగిన జగిత్యాల జైత్రయాత్ర స్ఫూర్తితో రాడికల్ స్టూడెంట్ యూనియన్ లో చేరారు. కోరుట్ల, కరీంనగర్ ప్రాంతాల్లో విద్యార్థి నాయకుడిగా చురుగ్గా పనిచేశారు. 1982లో పీపుల్స్ వార్ గ్రూపులో పూర్తిస్థాయి సభ్యుడిగా చేరారు. 1984లో ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి ఈయనను దండకారణ్యానికి పంపారు. అక్కడ సాయుధ దళాలను నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు. 1996లో దండకారణ్యంలో ఏర్పడిన మొదటి ప్లాటూన్ కు కమాండర్ గా బాధ్యతలు చేపట్టారు. 2001లో జరిగిన పార్టీ తొమ్మిదవ కాంగ్రెస్ లో కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2017లో పొలిట్ బ్యూరో సభ్యుడిగా పదోన్నతి పొందారు. సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఇన్చార్జ్గా పార్టీ సాయుధ దాడులకు వ్యూహకర్తగా వ్యవహరించారు. ఈయనపై ఛత్తీస్గఢ్ ప్రభుత్వం కోటిన్నర రూపాయల రివార్డు ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం ఈయనపై 25 లక్షల రూపాయల రివార్డు ఉంచింది. అనారోగ్య కారణాలు, పార్టీలో అంతర్గత విభేదాల వల్ల లొంగిపోవాలని నిర్ణయించుకున్నారు.

## రాజిరెడ్డిది 46 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం శాంతరాజుపల్లికి చెందిన మల్లా రాజిరెడ్డి సుమారు 46 ఏళ్ల సుదీర్ఘ అజ్ఞాత జీవితం గడిపారు. ఈయన 1970వ దశకం నుండే విప్లవ ఉద్యమంతో సంబంధం కలిగి ఉన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి అంచెలంచెలుగా ఎదుగుతూ కేంద్ర కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. దండకారణ్యం, మహారాష్ట్ర, ఒడిశా ప్రాంతాల్లో పార్టీ విస్తరణకు కృషి చేశారు. 2007లో జరిగిన పార్టీ యూనిటీ కాంగ్రెస్ లో పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈయన గతంలో కేరళలో ఒకసారి అరెస్టయ్యారు. జైలు నుంచి విడుదలైన తర్వాత తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లి కార్యకలాపాలు సాగించారు. మావోయిస్టు పార్టీ రీజనల్ బ్యూరో సభ్యుడిగా వివిధ రాష్ట్రాల మధ్య సమన్వయకర్తగా పనిచేశారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన అనేక సాయుధ పోరాటాలకు నాయకత్వం వహించారు. వృద్ధాప్య సమస్యలు వెంటాడటంతో శాంతియుత మార్గాన్ని ఎంచుకున్నారు. ఈయన లొంగుబాటుతో పార్టీ అత్యున్నత విభాగం బలహీనపడింది. ప్రభుత్వం ఈయనకు 25 లక్షల రూపాయల రివార్డు నగదును అందజేసింది.





## దామోదర్ ది  మూడు దశాబ్దాల చరిత్ర

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన బడే చొక్కారావు 28 ఏళ్లుగా పార్టీలో చురుగ్గా ఉన్నారు. ఈయన 1996లో విద్యార్థి సంఘం ద్వారా ఉద్యమ బాట పట్టారు. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఈయన బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఏటూరునాగారం, మహాదేవపూర్ ఏజెన్సీ ప్రాంతాల్లో దళ కమాండర్గా కార్యకలాపాలు సాగించారు. 2025 జనవరిలో ఈయన తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. గిరిజన యువతను పార్టీ వైపు ఆకర్షించడంలో ఈయన సిద్ధహస్తుడు. భద్రతా దళాల నిరంతర ఆపరేషన్ల వల్ల అడవిలో మనుగడ కష్టమని భావించారు. పార్టీ సిద్ధాంతాల పట్ల భ్రమలు తొలగి జనజీవన స్రవంతిలో చేరారు. ఈయనపై 20 లక్షల రూపాయల రివార్డు ఉంది. తెలంగాణలో పార్టీ ఉనికిని కాపాడటానికి ప్రయత్నించిన అగ్రనేతల్లో ఈయన ఒకరు. ఈయన లొంగుబాటు తెలంగాణ రాష్ట్ర కమిటీ పతనానికి సంకేతంగా నిలిచింది.

## సిద్ధాంత బోధకుడు నరసింహారెడ్డి

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లాకు చెందిన నూనె నరసింహారెడ్డి 36 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నారు. ఈయన మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా సుదీర్ఘ కాలం పనిచేశారు. రాజకీయ విద్యా విభాగంలో ఈయనకు మంచి పట్టు ఉంది. క్యాడర్ కు పార్టీ సిద్ధాంతాలను బోధించడంలో కీలక పాత్ర పోషించారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో కూడా ఈయన సేవలందించారు. విద్యార్థి దశలో పల్నాడు ప్రాంతంలో జరిగిన పోరాటాల ద్వారా ప్రభావితులయ్యారు. చదువు మధ్యలోనే వదిలేసి పూర్తిస్థాయి విప్లవ కార్యకర్తగా మారారు. వివిధ రాష్ట్రాల్లో పార్టీ విస్తరణకు రాజకీయ వ్యూహాలను రచించారు. నాయకత్వ మార్పులు, క్షేత్రస్థాయిలో మద్దతు కరువవ్వడంతో మార్పును కోరుకున్నారు. ఈయనపై ప్రభుత్వం 20 లక్షల రూపాయల రివార్డు ప్రకటించింది. లొంగిపోయిన తర్వాత ప్రభుత్వం కల్పించే పునరావాస పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇన్ని దశాబ్దాల తర్వాత తన కుటుంబ సభ్యులను కలుసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.





# మావోయిస్ట్ పార్టీ సుప్రీం దేవ్‌జీ లొంగుబాటు

- అదే బాటలో అగ్రనేతలు రాజిరెడ్డి, నరసింహరెడ్డి, దామోదర్
- అజ్ఞాతంలో తెలంగాణకు చెందిన మరో 11 మంది మావోయిస్టులు
- వారు మాతో టచ్ లో ఉన్నారు.. త్వరలోనే లొంగిపోతారు..
- అడవి బాట వీడిన ప్రతిఒక్కరికీ పునరావాస పథకాలు.. రివార్డులు: డీజీపీ శివధర్ రెడ్డి

**అక్షరదర్బార్, హైదరాబాద్**

సుమారు 5 దశాబ్దాల నుంచి మావోయిస్టు ఉద్యమంలో కొనసాగుతూ, పార్టీ చీఫ్‌గా ఎదిగిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. అదే బాటలో పార్టీ అగ్రనేతలు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రాం, రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనే నరసింహారెడ్డి అలియాస్ గంగన్న కూడా జనజీవన స్రవంతిలో కలిశారు. హైదరాబాద్‌లో మంగళవారం ఈ మేరకు డీజీపీ శివధర్‌రెడ్డి వారిని మీడియా ఎదుట ప్రవేశ పెట్టి వివరాలు వెల్లడించారు. ఐదు దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉన్న వీరంతా ఆయుధాలను విడనాడి శాంతియుత మార్గాన్ని ఎంచుకున్నారని డీజీపీ వెల్లడించారు. గడిచిన రెండేళ్లలో నలుగురు సెంట్రల్ కమిటీ సభ్యులు సహా మొత్తం 591 మంది జన జీవన స్రవంతి లోకి వచ్చారని వివరించారు. తెలంగాణకు చెందిన మరో 11 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని, వారిలో కొందరు తమతో చర్చలు జరుపుతున్నారని పేర్కొన్నారు. త్వరలో వారు కూడా లొంగిపోతారని స్పష్టం చేశారు. అజ్ఞాతం వీడిన ప్రతిఒక్కరికీ రివార్డులు అందజేస్తామని, ప్రభుత్వ పునరావాస పథకాలు వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. జన జీవన స్రవంతిలోకి వచ్చిన మావోయిస్టుల హక్కుల కాపాడేందుకు తాము అండగా ఉంటామని భరోసానిచ్చారు. మావోయిస్టుల లొంగుబాటులో కీలకంగా వ్యవహరించిన స్పెషల్ ఇంటెలిజెన్స్ ఐజీ సుమతి బృందానికి డీజీపీ అభినందనలు తెలిపారు.

# సైబర్ నెట్ వర్క్ పై ‘ఆక్టోపస్’ పంజా!

- రూ. 127 కోట్ల మోసం..
- 16 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు

అక్షర దర్బార్, హైదరాబాద్ : దేశవ్యాప్తంగా విస్తరించిన భారీ సైబర్ క్రైమ్ సిండికేట్‌ను హైదరాబాద్ పోలీసులు ఛేదించారు. ‘ఆపరేషన్ ఆక్టోపస్’ పేరుతో 16 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి, ఏకంగా 104 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ముఠా ఇప్పటివరకు సుమారు రూ. 127 కోట్లకు పైగా మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 200 మొబైల్ ఫోన్లు, 141 సిమ్ కార్డులు, 234 డెబిట్ కార్డులు, 26 ల్యాప్‌టాప్‌లు, రూ. 36 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా నమోదైన 1,055 సైబర్ కేసులతో ఈ ముఠాకు సంబంధం ఉందని, నేరాలకు సహకరిస్తున్న బంధన్ బ్యాంకు మేనేజర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నామని పోలీసులు వెల్లడించారు. స్పెషల్ బ్రాంచ్ జాయింట్ సీపీ విజయ్ కుమార్, సీవీఎస్ డీసీపీ అరవింద్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు ఈ భారీ ఆపరేషన్‌ను సక్సెస్ చేశాయి.



# భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు జైలు శిక్ష

### రెండు సంవత్సరాల కారాగార శిక్ష, రూ.3,000 జరిమానా

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి: భార్యను వేధింపులకు గురిచేసి ఆమె ఆత్మహత్యకు కారణమైన కేసులో నిందితుడికి రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.3,000 జరిమానా విధిస్తూ భూపాలపల్లి అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి ఎ. నాగరాజు మంగళవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన శైలజకు 2010లో కాల్వ రాజుతో వివాహం జరిగింది. వివాహం అయిన ఏడు సంవత్సరాలైనా సంతానం కలగలేదని భర్త తరచూ ఆమెను వేధించేవాడు. ఈ వేధింపులను తట్టుకోలేక 2017 ఏప్రిల్ 23న శైలజ క్రిమిసంహారక మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం హాస్పిటల్ కు మార్చినా చికిత్స పొందుతూ మరణించింది. ఈ ఘటనపై మహాదేవపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.డి. రఫిక్ వాదనలు వినిపించగా, పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నిందితుడికి శిక్ష విధించింది. కేసును సమర్థంగా దర్యాప్తు చేసిన అధికారులను జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్ అభినందించారు.



# రేవంత్ ధ్యాస 'ఫ్యూచర్ సిటీ'పైనే..

- పేదల 'హెల్త్ సిటీ'పై లేదు!
- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కావాలనే తొక్కిపెడుతున్నారు
- మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్
- పనులు పూర్తి చేయకపోతే వరంగల్ గడ్డపైనే నిరాహారదీక్ష చేస్తామని ప్రకటన
- ఎంజీఎం ఆసుపత్రి ఎలుకలు, పందికొక్కులకు అడ్డాగా మారిందని మండిపాటు
- బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన

**అక్షరదర్బార్, వరంగల్ :**

కాంగ్రెస్ ప్రభుత్వానికి రియల్ ఎస్టేట్ కమిషన్ల మీద ఉన్న శ్రద్ధ, పేదల ప్రాణాలు కాపాడే ఆసుపత్రుల మీద లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు విమర్శించారు. వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను మంగళవారం ఆయన బీఆర్ఎస్ బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఈపాటికి 24 అంతస్తుల ఈ భారీ ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి వచ్చేది. కానీ కాంగ్రెస్ వచ్చాక పనులు అటకెక్కాయి" అని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీపై చూపిస్తున్న శ్రద్ధలో 10 శాతం ఈ హెల్త్ సిటీపై పెట్టినా పనులు ఎప్పుడో పూర్తయ్యేవని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలోనే 24 అంతస్తుల స్లాబులు పూర్తయ్యాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక డిజైన్ల మార్పు పేరుతో పనులను నత్తనడకన సాగిస్తోందని మండిపడ్డారు. రోగుల బంధువుల కోసం నిర్మించ తలపెట్టిన 'ధర్మశాల' పరిమాణాన్ని సగానికి తగ్గించడాన్ని ఆయన తప్పుపట్టారు.

**- సిబ్బంది లేని ఆసుపత్రి ఎలా?**

జూన్ 2న ఆసుపత్రిని ప్రారంభిస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలపై హరీష్ రావు ప్రశ్నల వర్షం కురిపించారు. 2000 పడకల ఈ ఆసుపత్రికి కనీసం 1500 మంది డాక్టర్లు, 2000 మంది నర్సులు అవసరమని, ఇంతవరకు రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇది సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రా లేక బస్తీ దవాఖానానా? అని నిలదీశారు. గతంలో ఉచితంగా గుండె ఆపరేషన్లు చేసిన ఎంజీఎం ఆసుపత్రి నేడు ఎలుకలు, పందికొక్కులకు నిలయంగా మారిందని విమర్శించారు. ఆపరేషన్ థియేటర్లలో ఏసీలు పనిచేయక మూసివేస్తున్నారని, రోగులను హైదరాబాద్‌కు పంపిస్తున్నారని మండిపడ్డారు.

**- నిరాహారదీక్ష హెచ్చరిక**

ప్రభుత్వం వెంటనే స్పందించి ఆసుపత్రి పనులను పూర్తి చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ తరపున వరంగల్ గడ్డపైనే నిరాహారదీక్షకు దిగుతామని హరీష్ రావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, తక్కలపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు విజయభాస్కర్, టి రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, అరూరి రమేష్, శంకర్ నాయక్, నరేందర్, పార్టీ నేతలు కవిత, సమ్మారావు, శ్రేణులు పాల్గొన్నారు.



# సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం: ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీనియర్ జిల్లా నాయకులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు చిడెం మోహన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని చర్చిపేటలో సుందర్‌రావు మాస్టర్ ఇంటి నుండి ఎస్కే షర్ఫుద్దీన్ ఇంటి వరకు నిర్మించనున్న ఈ రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సన్ని, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సీతాదేవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిడెం శివ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టెం సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# ఇసుక స్మగ్లింగ్ పై ఉక్కుపాదం మోపాలి

**: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ తదితర శాఖలతో ఇసుక రవాణా నియంత్రణ, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా, కొడవటంచ జాతర ఏర్పాట్లు, యూరియా బుకింగ్ అంశాలపై చర్చించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే వెంటనే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేయాలని, నంబర్లు లేని వాహనాలకు అ టనుమతి లేదని స్పష్టం చేశారు. ఇసుకను స్థానిక అవసరాలకే వినియోగించాలన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మండలాల వారీగా అవసరాలపై నివేదికలు ఇవ్వాలని సూచించగా, ఎస్పీ సంకీర్త్ అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాతర సందర్భంగా అవసరమైన వసతులు కల్పించాలని, యూరియా కొరత లేదని రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని తెలిపారు.




# విద్యతోనే సమాజంలో గౌరవం

**- లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడి అశోక్**

అక్షరదర్బార్, ఇనుగుర్తి: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకున్నప్పుడే సమాజంలో గౌరవం లభిస్తుందని కేసముద్రం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడి అశోక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఇనుగుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 8వ, 9వ తరగతి విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా శ్రద్ధగా చదువుకొని, తల్లిదండ్రులకు మరియు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన లయన్స్ క్లబ్ జడ్సీ వెంకటరెడ్డి, పాస్ట్ జెడ్సీలు చిర్ర యకాంతం గౌడ్ లు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. చదువు ఒక్కటే పేదరికాన్ని పారద్రోలే ఆయుధమని, లయన్స్ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యర్నం శ్రీరాములు, క్లబ్ సభ్యులు బెజ్జం ప్రేమ కుమార్, మారం సమ్మిరెడ్డి, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం యాకయ్య, అయ్యగారి పల్లి సర్పంచ్ మలిశెట్టి శోభన్, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

- సీఎస్ రామకృష్ణారావు
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



అక్షర దర్బార్, మహబూబాబాద్: రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ఇంటర్, 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, సీసీ కెమెరాలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటర్ పరీక్షల కోసం 18 కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 8,287 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే 10వ తరగతి పరీక్షల కోసం 45 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 8,157 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్పీ డాక్టర్ శబరీష్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, అనిల్ కుమార్, డీఈఓ రాజేశ్వర్ పాల్గొన్నారు.

# అనవసర సిజేరియన్లు చేస్తే చర్యలు

- స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలి..
- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో
- పీసీపీఎన్ డీటీ చట్టంపై సమీక్ష

అక్షర దర్బార్, మహబూబాబాద్: జిల్లాలో అనవసర సిజేరియన్ ప్రసవాలను తగ్గించి, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పో వైద్యులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీసీపీఎన్‌డీటీ చట్టం అమలు, సి-సెక్షన్ ప్రసవాల నియంత్రణ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లోనే సిజేరియన్లు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్, ఐఎంఏ ప్రతినిధులు జగదీశ్వర్,



రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.



## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

### పంచాయతీరాజ్ కమిషనర్ కు రాష్ట్ర మాజీ సర్పంచ్ ల ఫోరం వినతి

అక్షరదర్బార్, పరకాల: హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ కమిషనర్ దివ్యను రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల ఫోరం ప్రతినిధులు కలిసి పెండింగ్ బిల్లుల విడుదలపై మెమొరండం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల కింద గ్రామపంచాయతీలకు రావాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ దివ్య స్పందిస్తూ రికార్డుల ప్రకారం సర్పంచులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరిత గతిన చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్రావు, ముస్తాలపల్లి మాజీ సర్పంచ్ బొట్ల సంధ్య రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## నరేష్ కుటుంబాన్ని పరామర్శించిన గంట కళావతి

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని 12వ వార్డుకు చెందిన రాస మల్ల నరేష్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు గంట కళావతి మంగళవారం నరేష్ నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు.అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి పార్టీ తరపున అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు.




## పేరుకే మండల కేంద్రం

- పారిశుధ్యం పల్లెల కంటే అధ్వాన్నం
- రోడ్లపైనే పారుతున్న మురుగునీరు

అక్షరదర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా నడికూడ మండల కేంద్రంలో మురుగు సమస్య తీవ్రంగా మారింది. నడికూడ నుంచి ధర్మారం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం జరిగి సంవత్సరాలు గడిచినా సైడ్ డ్రైనేజీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. మధ్యంతరంగా ఆగిపోయిన రోడ్డు పనుల కారణంగా మండల కేంద్రంలో కాలువలు లేకపోవడంతో మురుగునీరు నేరుగా రోడ్లపైకి చేరుతోంది. దీంతో వీధులంతా మురికి నీటితో నిండిపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. రోడ్డుపై నడవాలంటేనే గ్రామస్తులు జంకాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి సైడ్ డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టి శాశ్వత పరిష్కారం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- మూడు తండాల సర్పంచ్, ఉపసర్పంచ్ లు కాంగ్రెస్ లో చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే దొంతి
- నెక్కొండలో బీఆర్ఎస్ పార్టీకి గట్టి షాక్



అక్షర దర్బార్, నెక్కొండ: నెక్కొండ మండలంలో భారత రాష్ట్ర సమితి పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మండలంలోని మూడు తండాల గ్రామ సర్పంచ్ బోడ బాలు, ఉపసర్పంచ్ కేలోతు మమత నరేష్‌తో పాటు 6, 7, 8 వార్డు సభ్యులు బోడ వీరన్న, బోడ పవన్, బోడ మంగమ్మ రవి తదితరులు సుమారు 100 కుటుంబాలతో కలిసి బీఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, టౌన్ అధ్యక్షుడు సాయి కృష్ణ, ఉపసర్పంచ్ సింగం శ్రావణి ప్రశాంత్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లావుడ్యి తిరుమల్, బండి శివ, రావుల మైపాల్ రెడ్డి, దొడ్డ విజయ్, రాచకొండ రఘు, కొల్లి సుబ్బారెడ్డి, కొమ్మారెడ్డి, సుధాకర్ రెడ్డి, కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, చల్ల పాపిరెడ్డి, షేక్ షబ్బీర్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 28 నుంచి దేవుని గుట్టపై జాతర

### భక్తులు అన్ని సౌకర్యాలు: చైర్మన్ కిషన్ రావు

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు మండలం కొత్తూరు గ్రామంలోని దేవుని గుట్టపై కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవ జాతర ఈనెల 28 శనివారం నుండి మార్చి 2 సోమవారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవుని గుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ వీరంనేని కిషన్‌రావు తెలిపారు. ఆయన కార్యక్రమ వివరాలను వెల్లడిస్తూ.. 28-02-2026 (శనివారం): అభిషేకం, ప్రత్యేక పూజలు, 01-03-2026 (ఆదివారం): ఉదయం 11.30 గంటలకు స్వామివారి కళ్యాణ మహోత్సవం, 02-03-2026 (సోమవారం): హోమం, పూర్ణాహుతి, స్వామివారికి మొక్కులు సమర్పణ, గుట్ట కింద బండ్లు తిరుగుట కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జాతరలో దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దేవుని గుట్టపై కొలువైన స్వామివారి దర్శనార్థం వేలాదిగా తరలివస్తున్న భక్తులకు అన్ని వసతులు కల్పించేందుకు దేవస్థానం కమిటీ సర్వం సిద్ధం చేస్తోందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని చైర్మన్ వీరంనేని కిషన్‌రావు కోరారు.

## శిక్షణ కార్యక్రమంలో పెద్దకోడపాక పాలకవర్గం

అక్షర దర్బార్ శాయంపేట : నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల కోసం శాయంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పెద్దకోడపాక గ్రామ పాలకవర్గం పాల్గొన్నారు. గ్రామ సమస్యలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు వార్డు మెంబర్ ప్రాధాన్యత, తమ పరిధిలోని సమస్యలను సమర్థంగా పరిష్కరించే విధానాలపై వివరాలు తెలుసుకున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో మంద మానిక రత్నాకర్, కోగిల శంకరయ్య, కోగిల అరుణ బిక్షపతి, నాగేల్లి కిషోర్, మంద సదయ్య, గొడిశాల లలిత రాజేందర్, రెనుకుంట్ల స్వాతి పృథ్వీరాజ్, చందా రఘుపతి, పైండ్ల సునీత , చంద్రమౌళి, కుక్కల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



## డ్రైనేజీని శుభ్రం చేసిన కౌన్సిలర్ రాము

### హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



అక్షర దర్బార్, మరిపెడ: నిన్న అర్ధరాత్రి పట్టణంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. ముఖ్యంగా మురికి కాల్వలు చెత్తాచెదారంతో నిండిపోయి, మురుగు నీరు రోడ్లపైకి చేరే పరిస్థితి ఏర్పడింది. దీంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నట్టు సమాచారం అందగానే కౌన్సిలర్ మెరుగు రాము వెంటనే స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని హుటాహుటిన పిలిపించి శుభ్రత పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో ఆయనే స్వయంగా కాల్వలోకి దిగి పార పట్టి పేరుకుపోయిన మట్టి, చెత్తను తొలగిస్తూ సిబ్బందితో కలిసి పనిచేశారు. "సమస్య వచ్చినప్పుడు ఫోన్ చేస్తే చాలు.. వెంటనే స్పందించి పరిష్కరించే ఇలాంటి కౌన్సిలర్ మాకు ఉండటం గర్వకారణం" అని వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు లాభదాయకం

- కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగ శాస్త్రవేత్త డా. సౌమ్య
- వెంకటాపురంలో పత్తి రైతులకు శిక్షణ




అక్షర దర్బార్, దుగ్గొండి: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగ శాస్త్రవేత్త డా. సౌమ్య తెలిపారు. సోమవారం దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామంలో పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, మమునూరు ఆధ్వర్యంలో కేంద్రీయ పత్తి పరిశోధనా స్థానం సహకారంతో జాతీయ ఆహార భద్రత పథకం భాగంగా అధిక సాంద్రత పత్తి సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. సౌమ్య మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల కూలీల ఖర్చు తగ్గడమే కాకుండా పంట కాలం కూడా తగ్గుతుందని తెలిపారు. యాంత్రీకరణకు అనుకూలంగా ఉండే ఈ విధానంతో ఎకరానికి మొక్కల సంఖ్య పెరిగి, అధిక దిగుబడి సాధ్యమవుతుందని వివరించారు. సస్యరక్షణ విభాగ శాస్త్రవేత్త డా. రాజు మాట్లాడుతూ గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లింగాకర్షక బుట్టల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్ రైతులకు ప్రభుత్వ పథకాల సద్వినియోగం, రైతు నమోదు ప్రక్రియ, పర్యావరణ హిత ఎరువుల సమర్థ వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొగాకు శోభరాణి వెంకటేశ్వర్లు గౌడ్, ఉపసర్పంచ్ మాటేటి రవి, మాజీ సొసైటీ చైర్మన్ ఊరటి మహిపాల్, రాశి విత్తన సంస్థ సేల్స్ ఆఫీసర్లు రాము, మధు, కేవీకే యంగ్ ప్రొఫెషనల్స్ హర్షరెడ్డి, సాయిచంద్, గొర్కటి రాజుకుమార్ రైతులు ఊరట రవి, ప్రతాపరెడ్డి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఏడుస్తున్నాడని కన్నబిడ్డ సజీవ దహనం

- కన్నతల్లి కర్కశత్వం.. దుండిగల్ లో ఘటన
- నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



అక్షరదర్బార్, హైదరాబాద్: కన్నబిడ్డకు చిన్న గాయమైతేనే విలవిలలాడిపోయే ఏ తల్లైనా అల్లాడి పోతుంది. కానీ మేడ్చల్ జిల్లా దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన ఒక ఘటన వింటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. బౌరంపేట్‌లోని సానరెడ్డి హైరైజ్ అపార్ట్‌మెంట్స్‌లో మమత అనే మహిళ తన రెండు నెలల పసి కందును కట్టెల పొయ్యిలో వేసి సజీవ దహనం చేసింది. రాత్రంతా ఏడుస్తున్నాడని, దీంతో తాను విసిగిపోయి చంపేశానని తల్లి చెప్పడం పోలీసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. మధ్యప్రదేశ్ కు చెందిన మమత, రాజేంద్ర అనే దంపతులు కొన్నేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చారు. వారికి రెండు నెలల క్రితమే బిడ్డ పుట్టాడు. గడిచిన రెండు రోజులుగా బాబు విడవకుండా ఏడుస్తుండటంతో తల్లి మమత విసుగు చెందింది. ఈ క్రమంలోనే ఆమెలోని మాతృత్వం మంటగలిసిపోయింది. పసివాడు అని కూడా చూడకుండా బాబు నోట్లో గుడ్డలు కుక్కింది. ఎవరూ చూడకుండా కాళ్లు, చేతులు కట్టేసి సజీవంగా కట్టెల పొయ్యిలో వేసి చంపేసింది. చాలాసేపటి వరకు బాబు ఏడుపు వినిపించకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు వచ్చి చూశారు. అప్పటికే ఆ చిన్నారి కట్టెల పొయ్యిలో విగతజీవిగా పడి ఉన్నాడు. ఈ భయానక దృశ్యాన్ని చూసి చుట్టుపక్కల వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితురాలు మమతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెకు ఏమైనా మతిస్థిమితం లేదా అన్న కోణంలో విచారణ జరుపుతున్నారు. ప్రస్తుతం భార్యాభర్తలు ఇద్దరూ పోలీసుల వద్దే ఉన్నారు. కన్నతల్లే కాలయముడిలా మారి పసిగుడ్డును నిప్పుల పాలు చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

# బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్

**జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే మురళి నాయక్**



అక్షర దర్బార్ , మహబూబాబాద్: ఆదివాసీలకు సమ్మక్క–సారక్క జాతర ఎంత పవిత్రమైనదో, బంజారాలకు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు అంతటి విశిష్టమైనవని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళి నాయక్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన సేవాలాల్ 287వ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సేవాలాల్ మహారాజ్ అహింస, శాంతి మార్గంలో నడవాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బోధించి బంజారా జాతికే కాకుండా యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం‌లోని సేవాలాల్ ఆలయ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తానని, బంజారాలందరూ ఐక్యంగా ఉండి జాతి ఖ్యాతిని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పాల్వాయి జ్యోతి, వైస్ చైర్మన్ సోమయ్య, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి దేశీ రామ్ నాయక్, ఉత్సవాల ప్రత్యేక అధికారి మరియన్న, స్థానిక కౌన్సిలర్లు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# వాహనదారులు హెల్మెట్ ధరించాలి

**పరకాల ఏసీపీ సతీష్ బాబు**

అక్షర దర్బార్ శాయంపేట : వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని పరకాల ఏసిపి సతీష్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని మాందారి పేట జాతీయ రహదారి ప్రక్కన రోడ్డు భద్రత నియమాలలో భాగంగా వాహనదారుల కు కొన్ని సూచనలు సలహాలు చేశారు.ప్రతి ఒక్క వాహనదారుడు సరియైన పత్రాలను కలిగి ఉండాలని అన్నారు.లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదని సూచించారు.చిన్నపిల్లలు వాహనాలు నడపడం నేరమని, తల్లిదండ్రులు ఆ పిల్లలకు వాహనాలు ఇస్తే వారికి ఏమైనా జరిగితే అది తల్లిదండ్రులదే బాధ్యత అని అన్నారు. వాహనం ఇచ్చిన వారికి జైలు శిక్ష విధించబడుతుందని పేర్కొన్నారు.రోడ్డు దాటేటప్పుడు ఇరువైపులా చూసి దాటవలసి ఉంటుందని అన్నారు.ప్రాణాలను కాపాడుకోండి అనే ప్రోగ్రామ్ ను డిసిపి ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగిందని అన్నారు.తప్పకుండా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి సురక్షితంగా తమ ఇళ్లలోనికి చేరాలని అన్నారు. మీ భద్రతే పోలీసు వారి బాధ్యత అని గుర్తు చేశారు. ప్రమాదాలకు గురై మీ కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చకూడదని అన్నారు. అనంతరం హెల్మెట్లను వాహనదారులకు అందించారు.ఈ



కార్యక్రమంలో ఆత్మకూరు సిఐ సంతోష్ కుమార్, శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్,సర్పంచ్ కుక్కల సరోజన, చలివాగు ప్రాజెక్టు డైరెక్టర్ కుక్కల తిరుపతి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

**- బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్ రెడ్డి**



అక్షరదర్బార్, ఇనుగుర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజాపాలన' పేరుతో రైతులను నమ్మించి వంచిస్తోందని బీఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఎకరానికి ₹15,000 రైతు భరోసా ఇస్తామని నమ్మబలికిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలో తొక్కారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఏటా రెండు పంటలకు సకాలంలో పెట్టుబడి సాయం అందించి రైతును రాజును చేస్తే, నేటి కాంగ్రెస్ సర్కార్ నిధులు విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. సంక్రాంతికి ఇస్తామని, ఆపై ఫిబ్రవరి 17న వేస్తామని చెప్పి మాట తప్పారని.. తాజాగా జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో కూడా రైతు భరోసాపై స్పష్టత ఇవ్వకపోవడం రైతులను మోసం చేయడమేనని మండిపడ్డారు. ఇనుగుర్తి బ్యాంకు పరిధిలో రైతులకు అందాల్సిన ₹2 లక్షల రుణమాఫీ తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వీలైనంత త్వరగా రైతు భరోసా నిధులు విడుదల చేయకపోతే, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



# దివ్యాంగులకు ల్యాప్ ట్యాప్ లు పంపిణీ

అక్షర దర్బార్, హనుమకొండ: హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ఐదుగురు దివ్యాంగులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ చేతుల మీదుగా ల్యాప్ ట్యాప్ లను మంగళవారం పంపిణీ చేశారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐదుగురు దివ్యాంగులకు ల్యాప్ ట్యాప్ లను ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, సామాజిక వేత్త ఈ. వి. శ్రీనివాస్ రావు, ఎఫ్ ఆర్వో రవికృష్ణ పాల్గొన్నారు.

# అసోసియేషన్ పన్ను

- ఇసుక లారీల యజమానుల మధ్య లోకల్.. నాన్ లోకల్ లొల్లి
- ఒక్కో లారీకి రూ.500 చొప్పున వసూలు
- ప్రభుత్వ స్థలంలో అక్రమ పార్కింగ్ దందా



అక్షరదర్బార్, హనుమకొండ : ఓ వైపు ప్రభుత్వం ఇసుక రవాణాను క్రమబద్ధీకరిస్తుంటే, మరోవైపు క్షేత్రస్థాయిలో 'అసోసియేషన్' పేరిట సాగుతున్న వసూళ్ల పర్వం ఇసుక లారీ యజమానులను బెంబేలెత్తిస్తోంది. హనుమకొండ ములుగు రోడ్డులోని కాకతీయ కెనాల్ కట్టపై సాగుతున్న ఈ 'లోకల్ – నాన్ లోకల్' పంచాయతీ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. కన్నెమూల గణపతి టెంపుల్ ఎదురుగా ఉన్న నీటిపారుదల శాఖకు చెందిన కాకతీయ కెనాల్ స్థలాన్ని అడ్డాగా చేసుకున్న 'న్యూ కాకతీయ సాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్' ప్రతినిధులు, అక్కడ లారీల పార్కింగ్ నిర్వహిస్తున్నారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చే లారీల నుంచి అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**- ఒక్కో లారీ నుంచి రూ.500**

ఒక్కో లారీకి రూ.500 చొప్పున ప్రతిరోజూ 80 నుంచి 100 లారీల వరకు ఆపుతున్నారు. అంటే రోజుకు సుమారు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రూ.500 తీసుకుని అసోసియేషన్ పేరుతో రసీదులు ఇస్తున్నారని, ప్రశ్నిస్తే 'వే బిల్లులు' లాక్కుని దౌర్జన్యం చేస్తున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**- సీరియల్ పేరుతో వివక్ష**

వరంగల్ నగరంలో ఇసుక విక్రయానికి భూపాలపల్లి, ములుగు జిల్లాల నుంచి వచ్చే లారీలను కెనాల్ వద్దే ఆపేస్తున్నారు. 'లోకల్' పేరుతో వరంగల్ లారీలను ముందుగా పంపిస్తూ, ఇతర ప్రాంతాల లారీలను గంటల తరబడి నిలిపివేస్తున్నారు. దీనివల్ల ఆలస్యం కారణంగా వే బిల్లుల సమయం ముగిసిపోతోంది. సకాలంలో ఇసుక అన్ లోడ్ చేయలేక యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. నేరుగా నగరంలోకి వెళ్లాలని చూస్తే అసోసియేషన్ నేతలు అడ్డుకుంటూ హల్ చల్ చేస్తున్నారు.

**- అధికారులు స్పందించరా?**

టీజీఎస్ఎండీసీ ద్వారా డీడీలు కట్టి, చట్టబద్ధంగా ఇసుక రవాణా చేస్తున్న తమను అడ్డుకోవడానికి వీరెవరని ఇతర ప్రాంతాల లారీ యజమానులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా పార్కింగ్ నిర్వహిస్తూ, బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915